Eenadu

Dt 16/02/14



# మెట్రో రెండోదశ సేవలు వచ్చే ఏడాదిలో



పర్యవేక్షిస్తున్న ఎన్వీఎస్‌రెడ్డి తదితరులు

- మహిళల కోసం 'తరుణి' స్టేషన్
- యువతకు, పిల్లలకు ప్రత్యేక సదుపాయాలు
- హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి వెల్లడి

ఈనాడు, హైదరాబాద్

మియాపూర్ నుంచి ఎస్ఆర్‌నగర్ వరకు 12కి.మీ. మార్గంలో మెట్రోరైలు సేవలు 2015 ఆగస్టు 15 నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి వస్తాయని హైదరాబాద్ మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి వెల్లడించారు. కారిడార్-1లో రెండోదశైన ఈ మార్గంలో భరత్‌నగర్, మూసాపేట స్టేషన్ పనులు మాత్రమే మిగిలున్నాయని చెప్పారు. పనులు జరుగుతున్న తీరును ఆయన శనివారం భరత్‌నగర్ ఫ్లైఓవర్ నుంచి కూకట్‌పల్లి వై జంక్షన్ వరకు ప్రత్యక్షంగా పరిశీలించారు. హెచ్ఎంఆర్ చీఫ్ ఇంజినీర్ ఎండీ జియావుద్దీన్, జీఎం రాజేశ్వర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విష్ణువర్ధన్‌రెడ్డి, విద్యుత్తు అధికారి శ్రీమన్నారాయణ, ఎల్ అండ్ టీ ఇన్‌ఫ్రా హెడ్ శేషారెడ్డితో పనుల పురోగతిపై సమీక్షించారు. అడ్డంకులు తొలిగినందున పనుల వేగాన్ని పెంచాలని ఆయన ఇంజినీర్లను ఆదేశించారు. అనంతరం ఎన్వీఎస్ రెడ్డి మీడియాతో వెల్లడించిన విషయాలు.

- తొలి రైల్ ఓవర్ బ్రిడ్జిని భరత్‌నగర్‌లో నిర్మిస్తున్నాం. మాకు ఇదో పెద్ద సవాల్. 65 మీటర్లు దాదాపు 200 అడుగుల దూరం మధ్యలో స్తంభాలు వేయకుండా వయా డక్ట్‌లు వేయాల్సి ఉంటుంది. బ్యాలెన్స్ కాంటీలీవర్ పద్ధతిలో వీటిని చేస్తున్నారు. ప్రస్తుతం రెండు పిల్లర్ల మధ్య దూరం 100 అడుగులు ఉంది. ఇక్కడ రెండింతలు. అందుకు తగ్గట్టే గడ్డర్ల మందాన్ని మరింతగా పెంచి డిజైన్ చేశారు.
- పునాదులు వేయడం ఇక్కడ సవాల్‌గా మారింది. మట్టి గట్టిగా లేక ఎంత లోతు తవ్వినా దిగబడుతూనే ఉంది. దీంతో ఫ్లోరింగ్ అండ్ షట్టరింగ్ విధానంతో ఓపెన్ ఫౌండేషన్లను వేశాం.
- ఇక్కడే నాలా సమీపంలో ఈ విధానమూ సరిపోలేదు. అక్కడ పైల్ రింగ్ మిషన్‌ను ఉపయోగించాం. ఒక మీటర్ వ్యాసం కలిగిన ఆరు రంధ్రాలను చేసి వాటిని కాంక్రీట్‌తో నింపి పునాది వేశారు. 60 అడుగుల లోతు వరకు ఒక్కో రంధ్రం చేసేందుకు 12 గంటల సమయం పట్టేది. కాంక్రీట్ వేసేందుకు మరో 12 గంటలు పట్టేది. నాలాలోనూ ఈ పద్ధతి అవలంబించి పునాది వేశాం. అదే సమయంలో నాలా వెంట గతంలో కంటే సులువుగా నీళ్లు వెళ్లేలా ఖాళీ స్థలం వదిలాం. నాలా పూడ్చేస్తున్నారనే ఆరోపణ అవాస్తవం.
- భరత్‌నగర్‌లో కూరగాయల మార్కెట్‌కు ప్రత్యామ్నాయంగా ఫ్లైఓవర్ గోడౌన్‌ను రైతులకు కేటాయించాం. ఆర్అండ్ బీతో మాట్లాడి దాదాపు 26వేల చదరపు అడుగుల విస్తీర్ణం కల్గిన గోడౌన్‌ను 50 మంది రైతులకు కేటాయించారు.
- భరత్‌నగర్ మెట్రో స్టేషన్ నుంచి రైల్వే స్టేషన్‌కు స్కైవాక్‌లను నిర్మిస్తాం. ఈ ప్రాంతం హైదరాబాద్ హబ్‌గా మారుతుంది.
- మూసాపేటలో రహదారి వెడల్పు పనులు బుధవారం నాటికి పూర్తవుతాయి. అనంతరం బారికేడింగ్ చేసి స్తంభాల పనులు మొదలు పెడతారు.
- మూసాపేట నుంచి కూకట్‌పల్లి వై జంక్షన్ వరకు రహదారి విస్తరణ పూర్తయ్యింది. ఓపెన్ నాలాలలను భూగర్భ డ్రైన్లుగా ఆధునికీకరించాం. సిటీలో దాదాపు 20 నాలాలను అభివృద్ధి చేశాం. ఈ ప్రాంతంలో విస్తరణ, వరద, మురుగు, మంచినీరు, కరెంట్ లైన్లను మార్చేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. దాదాపు రెండేళ్లు పట్టింది. 4 కోట్లు ఖర్చయ్యింది.
- మూసాపేట స్టేషన్ పనుల్లో మరో సవాల్ ఎదురైంది. ఇక్కడ పునాదులు వచ్చేచోట బండరాయి వచ్చింది. వీటిని బ్లాస్టింగ్‌తో తొలగిస్తున్నాం. ఐడీఎల్ చెరువు నుంచి వరద కాలువ ఒకటి పునాదుల తవ్వకాల్లో అడ్డుపడింది. దీంతో స్టేషన్ డిజైనింగ్‌లో స్వల్ప మార్పులు చేయాల్సి ఉంటుంది. ఎక్కడికక్కడ ఎదురవుతున్న సమస్యలను అధిగమిస్తున్నాం.

### ఒక్కో చోట ఒక్కొక్కరికి..

మెట్రో స్టేషన్లలో అన్నివర్గాలకు ప్రత్యేక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు. ఎంపిక చేసిన వర్గాలకు ఒక్కోచోట హెచ్ఎంఆర్ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. మధురానగర్‌లో మహిళల కోసం తరుణి స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. యువత కోసం యూసుఫ్‌గూడ స్టేషన్‌లో, పిల్లలకు మియాపూర్, ఉప్పల్ స్టేషన్లలో ప్రత్యేక ఏర్పాట్లు రాబోతున్నాయి.